క్లుప్తంగా

టీఐఎస్ నమోదు గడువు పెంచాలి

కె.గంగవరం: టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎస్) నమోదుపై ప్రభుత్వ స్పందించి గడువు పెంచాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి దర్శిపాటి సురేష్ కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఏడాది వేసవిలో చేపట్టబోయే పదోన్నతుల, బదిలీల నిమిత్తం సీఎస్‌సీ వెబ్‌సైట్‌లో సుమారు 1.87 లక్షల మంది ఉపాధ్యాయులు 136 అంశాలతో కూడిన తమ సర్వీసు వివరాలను పూర్తి వివరాలు నమోదు చేయాల్సి ఉందన్నారు. అయితే సర్వర్ పూర్తి స్థాయిలో పని చేయకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చిందని, కానీ కొంత మంది ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్, ఎస్ఎల్‌డీసీ శిక్షణలో ఉన్నారని, సర్వర్ సమస్య ఉందని ఇలాంటి పరిస్థితులలో టీఐసీ నమోదు గడువు పెంచాలని వారు విద్యాశాఖను కోరారు.

విద్యార్థి వైద్యానికి సహచరుల ఆర్థిక సాయం

మండపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరిన తమ తోటి విద్యార్థి వైద్యానికి ద్వారపూడిలోని బాలమణికంఠ పాఠశాల విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. ఈ పాఠశాల విద్యార్థి అనదాసు వెంకటరమణ ఈ నెల 19న శ్రీరాంపురం రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.అతడికి బ్రెయిన్ ఆపరేషన్ చేయాలని వైద్యులు స్పష్టం చేశారు. ఆ విద్యార్థి తల్లిదండ్రులు మధ్యతరగతి కుటుంబానికి చెందిన వారు. అతడికి ఆర్థికంగా అండగా నిలబడాలని ఆ పాఠశాల విద్యార్థులంతా సంకల్పించారు. వారంతా విరాళాలు సేకరించి రూ.50 వేలు సమకూర్చారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా తమవంతు సహకారం అందించారు. శనివారం ఆసుపత్రికి వెళ్లి ఆ మొత్తాన్ని విద్యార్థి కుటుంబ సభ్యులకు అందజేశారు.

వామనావతారంలో శ్రీవారు

రాయవరం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారు శనివారం వామనావతారంలో దర్శనమిచ్చారు. వేంకటేశ్వర భక్తజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దశావతార మహోత్సవాల్లో భాగంగా స్వామివారిని వామనావతారంలో అలంకరించారు. ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

4న మండల సమావేశం

కె.గంగవరం: జనవరి 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో బడ్జెట్ ఆమోదంతో పాటు పలు అంశాల ఆమోదం కోసం చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామ స్థాయి నివేదికతో హాజరు కావాలని ఆయన కోరారు.

పోషకాహార ప్రయోజనాలపై వీధి నాటకం

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా గర్భిణులు, చిన్న పిల్లలకు పోషకాహార ప్రయోజనాలు, అయోడిన్ లోపం వలన కలిగే అనారోగ్య సమస్యలపై వీధి నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఉప సర్పంచ్ నీలం భవాని, వైద్య సిబ్బంది, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదివారమూ బిల్లులు చెల్లింపునకు ఏర్పాట్లు

రామచంద్రపురం రూరల్: విద్యుత్ వినియోగదారులు ఆదివారం రోజున కూడా బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేసినట్లు రామచంద్రపురం పట్టణ, రామచంద్రపురం రూరల్ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ జిల్లా సూపరిండెంట్ ఇంజినీర్ రాజబాబు ఆదేశాల మేరకు విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు పనిచేస్తాయన్నారు. విద్యుత్ రెవె న్యూ కేంద్రాలతో పాటు సెక్షన్ ఆఫీస్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్‌లలో కూడా నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ద్రాక్షారామ భీమేశ్వరుని సన్నిధిలో అధికారులు



భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న అడిషనల్ చీఫ్ సెక్రటరీలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని బిహార్ రాష్ట్ర అడిషనల్ చీఫ్ సెక్రటరీలు డాక్టర్ ఎస్.సిద్ధార్థ్, ఎస్.వి జయలక్ష్మి శనివారం దర్శించుకున్నారు. అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామికి విశేష అభిషేకం, మాణిక్యాంబా అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించుకున్నారు. వారికి ఆలయ బేడా మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ సిబ్బంది స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఆర్నెల్లకే కూటమిపై పోరు...



మండపేట గొల్లపుంత వద్ద మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ నవంబర్ 1న రోడ్డుపై ధర్నా చేస్తున్న స్థానికులు

- తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్న చిరుద్యోగులు
- స్థానిక సమస్యలపైనా సామాన్యుల అసహనం

2024 రివైండ్

కపిలేశ్వరపురం: సామాన్య ప్రజలకు పాలకులే ఆధారం. తమ ఓట్లతో గెలిచిన ప్రభుత్వాధినేతలు పాలనాకాలం ఐదేళ్లు పూర్తయ్యే వరకూ తమకు అండగా నిలవాలని ఆశిస్తారు. 2024 ఏడాది పలు ప్రత్యేకతలకు నెలవు. ఇచ్చిన మాట ప్రకారం సామాన్యుల సంక్షేమమే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చే వరకూ తనదైన శైలిలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించారు. కారణాలేమైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2024 ఏడాది మలి ఆర్నెల్లు కూటమి పాలనలో ప్రజలు అష్ట కష్టాలు చవి చూస్తున్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఇస్తానన్న అనేక హామీల అమలు ఊసెత్తడం లేదు. కేవలం పింఛన్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్న వైనం కూటమి పాలకులది. రామచంద్రపురం, మండపేట నియోకవర్గాల్లో ప్రభుత్వ తీరుపై పలుమార్లు ప్రజలు తిరగబడ్డారు. 2024 ఏడాది మొదటి ఆర్నెల్లలో సంక్షేమమూ, మలి ఆర్నెల్లలో కష్టనష్టాలు, స్థానిక సమస్యలపై ప్రజల చైతన్య ఉద్యమాలపై 2024 ఇయర్ రౌండప్.

జూలై:
- 04 మండపేటలో విద్యారంగ పరిరక్షణకై విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు.
- 04: వెల్లలో అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చివేయడాన్ని నిరసిస్తూ నిరసన తెలిపారు.
- 10 కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ అంగన్‌వాడీలు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించారు.
- 10 సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ డిమాండ్ల పరిష్కారానికై భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు.

ఆగస్టు:
- 12 రామచంద్రపురంలోని పాలిటెక్నిక్ కళాశాలను తరలించవద్దంటూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.
- 17 కోల్‌కత్తా వైద్యురాలి హత్యను నిరసిస్తూ రెండు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో వైద్య ఆరోగ్య కార్యకర్తలు నిరసన తెలిపారు.

సెప్టెంబర్:
- 11 ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా కోర్టు తీర్పును నిరసిస్తూ రామచంద్రపురంలో మాల సామాజిక వర్గీయులు ర్యాలీ నిర్వహించారు.

అక్టోబర్:
- 25 విధి నిర్వహణలో వ్యాపార లక్ష్యాలను నిర్దేశించడాన్ని నిరసిస్తూ రామచంద్రపురంలో తపాలా ఉద్యోగులు నిరసన తెలిపారు.
- 25 తమ డిమాండ్ల సాధనకై రామచంద్రపురంలో ఎల్ఐసీ ఏజెంట్లు నిరసన తెలిపారు.

నవంబర్:
- 01: మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ మండపేట గొల్లపుంత కాలనీ నివాసితులు రోడ్డుపై ధర్నా చేశారు.
- 01 వెల్లలో మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు.

డిసెంబర్:
- 13న రైతాంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అమలాపురంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు.
- 27న విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు, తోట త్రిమూర్తులు, పిల్లి సూర్య ప్రకాశ్‌ల ఆధ్వర్యంలో ఆయా పట్టణాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



యూటీఎఫ్ స్వర్ణోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వెంకటరమణ, ఎంపీడీవో కీర్తిస్పందన తదితరులు

రాయవరం: జనవరి 5న నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంస్థ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడలి శ్రీనివాస్, జి.మురళీకృష్ణ కోరారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల వాల్ పోస్టర్‌ను శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీడీవో కీర్తిస్పందన చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, యూటీఎఫ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కుల గణనను సద్వినియోగం చేసుకోవాలి

మండపేట: ఎస్సీ వర్గీకరణకు వీలుగా ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ కులాల గణనను మాదిగలు, మాదిగ ఉప కులాల వారు సద్వినియోగం చేసుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దూలి జయరాజు మాదిగ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు వర్గీకరణకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్‌మిశ్రా ఏక సభ్య కమిషన్ అన్ని జిల్లాల్లో పర్యటిస్తోందన్నారు. కుల గణాంకాలను ప్రభుత్వానికి నివేదించేందుకు అభ్యంతరాలు తెలపడానికి కమిషన్ ఈ నెల 31 వరకూ గడువు ఇచ్చిందన్నారు. అయితే మాదిగ, మాదిగ ఉప కులాల వారి ఇంటి పేర్లు మాల కులస్తుల్లో కూడా ఉన్నాయన్నారు. ఇలా వుండడం వల్ల కులగణనలో మాదిగల్లోని అధిక శాతం మంది మాల కులస్తులుగా నమోదై ఉన్నారని వివరించారు. ఎస్సీ వర్గీకరణ ఫలాలు పొందాలంటే ఇలాంటి మార్పు చేర్పులను నవీకరించుకోవడానికి ఈ నెల 31 వరకూ కమిషన్ ఇచ్చిన గడువును వినియోగించుకుని మాదిగ జాబితాలోకి చేరాలని జయరాజు కోరారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

- గ్రామాల్లో ప్రారంభమైన సంక్రాంతి సందడి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కోలాహలంగా స్వామివార్ల ఊరేగింపు



గొల్లపాలెం గ్రామవీధుల్లో పల్లకీలో ఊరేగుతున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న విష్ణువాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాలు, వేణుగోపాలస్వామి వారి ఆలయాల్లో ధనుర్మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఏటా మార్గశిర మాసం ధనుస్సంక్రాంతి మొదలుకొని ధనుర్మాసంలో నెలరోజుల పాటు గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. వాస్తవానికి ఈ కార్యక్రమాలతోనే గ్రామాల్లో సంక్రాంతి నెల ప్రారంభమయినట్టుగా ప్రజలు భావిస్తుంటారు. దీనినే పలువురు 'నెల గంటకట్టడం' అని కూడా అంటుంటారు. ధనుర్మాసం పురస్కరించుకుని మండలంలోని గొల్లపాలెం వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయం, శీల, కాజులూరు, అయితపూడి, కోలంకల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ రోజూ వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. చామంతిపూలు, తులసిదళాలు, వివిధ రకాల పుష్పాలతో రోజుకో రీతిన స్వామి వారిని అలంకరించి అభిషేకాలు నిర్వహిస్తు, ఆలయాల్లోని అమ్మవారికి కుంకుమార్చనలు చేస్తున్నారు. అనంతరం స్వామిని పల్లకీలో గ్రామ వీధుల్లో ఊరేగించి రాత్రి సమయాల్లో ఆలయం వద్ద సేవా సంబరాన్ని నిర్వహించి వేంకటేశ్వర స్వామి కథ ఇతివృత్తాన్ని భక్తులకు వివరిస్తున్నారు. గ్రామాల్లో పలువురు భక్తులు రోజుకో కుటుంబం చొప్పున ఈ కార్యక్రమాల ఆర్థిక, నిర్వహణ బాధ్యతలు స్వీకరిస్తుంటారు. ఆయా కుటుంబ సభ్యులంతా ఆరోజు వేకువజామునే ఆలయానికి చేరుకుని స్వామికి తొలిపూజ నిర్వహిస్తారు. గ్రామోత్సవంలో భాగంగా పల్లకీలో తమ ఇంటికి వచ్చిన స్వామి వారికి భక్తులు ధనధాన్యాలు, బియ్యం కానుకలుగా ఇచ్చి పురోహితుల నుంచి ఆశీర్వచనాలు తీసుకుంటున్నారు. ఈ ధనుర్మాస పూజలు, కార్యక్రమాలు భోగిరోజు వరకు కొనసాగుతాయని అనంతరం గోదాదేవి కల్యాణంతో కార్యక్రమాలు పూర్తవుతాయని, అప్పటివరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి, ప్రసాద వితరణ చేస్తామని గొల్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు సర్వే రామకృష్ణాచార్యులు తెలిపారు.

అధికార పార్టీ నేతల పొలాల్లోకి పైపులైన్లు

నిలదీసిన వైఎస్సార్ సీపీ నాయకులు



తాతపూడిలో పైపులైన్ నిర్మాణం జరుగుతున్న తీరును వివరిస్తున్న గూటం సత్యనారాయణ

కపిలేశ్వరపురం: జల్‌జీవన్ మిషన్ ద్వారా మండలంలోని తాతపూడిలో తాగునీటి పైపులైన్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సమాయత్తం అయ్యారు. ఆ మేరకు శుక్రవారం గ్రామంలో పైప్ లైన్ నిర్మాణానికి గాడులు తవ్వే పనులను ప్రారంభించారు. జనావాసాల్లో కాకుండా అధికార టీడీపీ అనుకూలుర పశువుల పాకలు ఉన్న ప్రాంతాలకు పైప్‌లైన్ నిర్మాణానికి ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ సంబంధిత అధికారులను నిలదీశారు. జలజీవన్ మిషన్ అనేది ప్రజలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించినది, వ్యవసాయ క్షేత్రాల వైపు పైపులైన్ వేయడాన్ని ప్రశ్నించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన అధికార టీడీపీ నాయకుల ప్రోద్భలంతో పైప్‌లైన్ నిర్మాణం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీ పాలకవర్గాన్ని విస్మరిస్తోందన్నారు. సర్పంచ్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, పంచాయతీ తీర్మానాలు లేకుండా పనులు చేస్తున్నారన్నారు.ఉన్నతాధికారులు స్పందించి గ్రామస్తులకు ప్రయోజనం చేకూరేలా జలజీవన్ మిషన్ పనులను చేపట్టాలని సత్యనారాయణ కోరారు.

దేవానందంకు పలువురి పరామర్శ



తోటపేటలో సీతమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ చొప్పెల్ల దేవానందం తల్లి సీతమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, హైకోర్టు సీనియర్ న్యాయవాది కర్రి గనిరెడ్డి, రామచంద్రపురం, కె.గంగవరం ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, మాజీ ఎంపీపీలు వట్టికూటి రాజశేఖర్, పెట్టా శ్రీనివాసరావు, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ నరాల రాధాకృష్ణ, ప్రెస్‌క్లబ్ సభ్యులు నరాల త్రిమూర్తులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తోటపేట గాంధీనగర్‌లోని దేవానందం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

అవగాహనతో కిశోరి వికాసం



కపిలేశ్వరపురంలో శిక్షకులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీఓ రత్నకుమారి

కపిలేశ్వరపురం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన కిశోరి వికాసం కార్యక్రమాలపై ప్రభుత్వోద్యోగులు, సిబ్బందికి అవగాహన అవసరమని ఎంపీడీఓ కె.రత్నకుమారి అన్నారు. ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ అధికారి అధికారి గజలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కిశోరి వికాసం మండలస్థాయి శిక్షకులను ఉద్దేశించి ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి, అంగర శ్రీసిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ పి.రమణ, అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, శ్రమ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ నాగేశ్వరి మాట్లాడుతూ కిశోర బాలికలకు సామాజిక అంశాలపై అవగాహన కలిగించాలన్నారు. లింగ వివక్షత, నైపుణ్య ఉపాధి, మానవ అక్రమ రవాణా, సంపూర్ణ ఆహారం,ఆరోగ్యం, బాల్య వివాహాలను అరికట్టడం తదితర అంశాలపై మాట్లాడారు.

పీఠంలో ముగిసిన పవిత్రోత్సవాలు

హాజరైన టీటీడీ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు



గాడ్ ఆశీస్సులు పొందుతున్న టీటీడీ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు

రాయవరం: రెండు రోజులుగా వెదురుపాక విజయదుర్గా పీఠంలో నిర్వహించిన పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి.ఈ వేడుకలు తిలకించేందుకు టీటీడీ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు పీఠాన్ని సందర్శించి, పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. పవిత్రోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. వైఖానస పండితులు సాయి బృందం ఆధ్వర్యంలో విజయదుర్గ అమ్మవారికి అర్చనలు, స్వామివారికి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాల అనంతరం పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగించారు. పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక సందేశమిస్తూ లోక కల్యాణం కోసం, పీఠానికి వచ్చే భక్తుల సంక్షేమం కోరుతూ పవిత్రోత్సవాలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ సందర్భంగావిజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదె భాస్కర నారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి శ్రీనివాసమూర్తి, సత్యకనకదుర్గ, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, అదిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి ఆర్థికసాయం



శలపాక సర్పంచ్ పోతుల గనిరాజు తదితరులకు రూ.50 వేల చెక్కు అందిస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: మండలంలోని శలపాకలో ఇటీవల దారుణ హత్యలకు గురైన బత్తుల రమేష్ కుటుంబ సభ్యులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. అక్టోబరు 30 దీపావళి రోజున శలపాకలో చిన్నపేటకు చెందిన పాట్లకాయల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఎదురింటిలో ఉంటున్న బత్తుల చిన్నయ్య కుటుంబ సభ్యులపై దాడిచేయగా బత్తుల చిన్నయ్య(56) అతని కుమారుడు బత్తుల రమేష్ (28) తమ్ముడు బత్తుల రాజు (49) అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ బాధిత కుటుంబీకులను పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం కొంత సహకారాన్ని అందించారు. ఆ సమయంలో బత్తుల రమేష్ భార్య శ్రీవలికలకి తగిన సహకారం అందించి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం బత్తుల శ్రీవల్లి కుమారుడు పవన్‌కుమార్ భవిష్యత్తు కోసం రూ.50 వేలు చెక్కు రూపంలో సర్పంచ్ పోతుల గనిరాజు తదితరులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతురాజు బీమారావు, మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పలు కార్యక్రమాలు

- మరో రూ.123 కోట్లతో ప్రతిపాదనలు
- పార్టీలకు అతీతంగా సంక్షేమం అమలు
- మీడియా సమావేశంలో మంత్రి సుభాష్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: నియోజకవర్గంలో రూ.246 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా, కక్ష సాధింపు లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్ల మరమ్మతుల కోసం ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ ద్వారా రూ.15 కోట్లతోను, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా రూ.9.72 కోట్లతో పనులు చేపట్టామన్నారు. డ్వాక్రా స్వయం సహాయక సంఘాలకు రూ.116 కోట్లు అందించామన్నారు. ఇటీవల వరదల వల్ల జరిగిన పశునష్టం, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పశువుల షెడ్ల నిర్మాణం వంటి పనులకు నిధులు కేటాయించామన్నారు. నియోజవర్గంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కింద రూ.73.84 కోట్లు పంపిణీ చేశామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.6.89 కోట్లతో, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 46 మంది నిరుపేదలకు రూ.86 లక్షలు ఆర్థికసాయం అందించామని ప్రకటించారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని అంధకారంలో నెట్టేశారని విమర్శించారు. పలుమార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం ప్రజలపై మోపారన్నారు. తగదునమ్మా అంటూ ఇప్పుడు నిరసనలు వ్యక్తం చేయడం, కూటమి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నంలో భాగమన్నారు. నియోజకవర్గంలోని వెంకటాయపాలెం గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ విషయంలో వైఎస్సార్ సీపీ నాయకులు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి సుభాష్ మండిపడ్డారు. భవన నిర్మాణం పూర్తి కాకుండా అనధికారికంగా అద్దెకు ఇవ్వడంపై వచ్చిన ఫిర్యాదు మేరకు అన్ని ఆధారాలతో మండల జేఈ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా తనపై నిందలు వేయడం సరికాదన్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ విచారణ అధికారిని నియమించారని, చట్టం తన పని తాను చేసుకుంటుందన్నారు. వెంకటాయపాలెం సర్పంచ్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, అతని కుమారుడు వాస్తవాన్ని వక్రీకరిస్తూ తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన అవినీతిపై పిల్లి సుభాష్ చంద్రబోస్ ఎందుకు ప్రశ్నించలేదని మంత్రి సుభాష్ ప్రశ్నించారు. తమ పార్టీలోకి రానందుకే తమపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. నవరత్నాల పేరుతో నియోజకవర్గంలో అవినీతి జరిగిందని అన్నారు. జగనన్న కాలనీ లేఅవుట్ల ల్యాండ్ ఫిల్లింగ్, ఈ క్రాప్ ఇన్సూరెన్స్‌లో, ద్రాక్షారామ దేవాలయంలో, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో జరిగిన అవినీతిపై డిబేట్‌కు రావాలని మంత్రి సవాల్ విసిరారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దూరమని, అదే సమయంలో అవినీతిని సహించబోమని మంత్రి సుభాష్ హెచ్చరించారు.

శిక్షణ తరగతులను వినియోగించుకోవాలి

మండపేట: నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాలను ముస్లిం మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలని ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకుడు సల్మాన్ హుస్సేన్ కోరారు. మండపేటలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ముస్లిం మైనారిటీ యువత కోసం సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇందులో పారిశ్రామిక రంగంలో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పొందేందుకు మైనారిటీ యువతకు శిక్షణ ఇస్తుందన్నారు. అవసరమైన సహాయాన్ని కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. శిక్షణ కాలంలో అన్ని వసతులనూ ఉచితంగా కల్పిస్తారన్నారు. శిక్షణ పూర్తయ్యాక ఎన్ఎస్‌డీసీ ద్వారా ధ్రువీకరణ పత్రంతో పాటు ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తారని వివరించారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లోని మైనార్టీల సంక్షేమ శాఖ ఫైనాన్స్ కార్యాలయంలో దరఖాస్తులు లభిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముచ్చుమిల్లి రోడ్డు వెడల్పు చేయాలి

- కౌన్సిల్ సమావేశంలో సభ్యుల వినతి
- 30 అంశాలకు కౌన్సిల్ ఆమోదం



ముచ్చుమిల్లి రోడ్డును వెడల్పు చేయాలని చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

రామచంద్రపురం: పట్టణంలోని మార్కెట్ సెంటర్ నుంచి వెళ్లే ముచ్చుమిల్లి ప్రధాన రహదారిని వెడల్పు చేయాలని కౌన్సిల్ సభ్యులు సమావేశంలో చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. సాధారణ కౌన్సిల్ సమావేశం శనివారం చైర్ పర్సన్ శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఎజెండాలో మొత్తం 31 అంశాలను సభ్యులకు చదివి వినిపించారు. వాటిలో పలు అభివృద్ధి పనులు, మున్సిపల్ షాపుల టెండర్ల అంశాలైన మొత్తం 30 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. కాగా 16 అంశంగా ప్రవేశపెట్టిన వాటర్ మీటర్ల ఏర్పాటు అంశాన్ని సభ్యులు ఆమోదం తెలపకపోవటంతో దానిని చైర్‌పర్సన్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిపాదించిన బైలా నిబంధనలను వాయిదా వేయాలని కోరడంతో అంశాన్ని వాయిదా వేశారు. కౌన్సిలర్ పెంటపాటి శ్రీదేవి మాట్లాడుతూ వార్డుల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన అమలు చేయాలని సూచించారు. దీనికి చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందిస్తూ పనులు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ తదితరులు మాట్లాడుతూ పట్టణంలోని ముచ్చుమిల్లి రోడ్డు వెడల్పు చేసి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల్లో శనివారం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.ఆయా పంచాయతీల సర్పంచ్‌లు వీధి వెంకటరెడ్డి, నాతి గవరయ్య అధ్యక్షతన నిర్వహించిన సదస్సుల్లో గ్రామ సదస్సుల ప్రాధాన్యతను తహసీల్దార్ చిన్నారావు వివరించారు. భూహక్కులపై తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించమంటూ భూ యాజమానుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు యర్రంశెట్టి నాగేశ్వరరావు, ఆయా వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

హసన్‌బాద సదస్సుకు 3 అర్జీలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 3 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎం.సావిత్రి విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ దేవరకొండ అఖిల మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల అర్జీలను నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యెన్నం దేవి, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఉప సర్పంచ్ నీలం భవాని, డీటీ ఎం.చంద్రశేఖర్, వీఆర్ఓ నరహరశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.